## సిఎం సమీక్షలో కలెక్టర్

**ప్రజాశక్తి -నెల్లూరు**

విజయవాడలో రెండు రోజులు జరుగుతోన్న కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఒ.ఆనంద్ పాల్గొన్నారు. విజన్ డాక్యుమెంట్‌కి సంబంధించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రసంగించారు. నెల్లూరుజిల్లా విజన్‌కు సంబంధించి కలెక్టర్ వివరించనున్నారు.నేడు ఎస్‌పి కృష్ణకాంత్ కూడా సిఎం సమీక్ష సమావేశంలో పాల్గొననున్నారు.

సిఎం నిర్వహించిన సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ ఓ ఆనంద్

# సహజ సంపద నేతల ఫలహారం..!

సహజ సంపదను పప్పు, బెల్లాంలా నేతలు పంచుకుతింటున్నారు..నిన్నటి వరకు వైసిపి పెద్దలు, స్థానిక నేతలు తెల్లరాయిని తవ్వి అమ్ముకున్నారు..తాను అధికారంలోకి వస్తే అంతుచూస్తానని, కేసులు పెట్టి, అవినీతి సొమ్ము కక్కిస్తానని చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, లోకేష్ బాబు అదే బాటలో వెళుతున్నారని టిడిపి నేతలు, ప్రజలు విమర్శలు చేస్తున్నారు. సైదాపురం తెల్లరాయి వ్యవహారంలో నెల్లూరు నగరానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి, స్థానిక నేత దక్కించుకోడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి ఎంఎల్‌ఎలు, నేతలు అగ్గిలా రగిలిపోతున్నారు. మా ప్రాంతంలో వారి పెత్తనం ఏమిటంటూ ప్రశ్నిస్తున్నారు..మా వాటా సంగతేమిటనే గగ్గోలు పెడుతున్నారు. ఇక్కడ మైనింగ్ లీజ్ దారులు మాత్రం ఆశగా ఎదురు చూస్తున్నారు. రాజధానిలో వ్యవహారం నడుస్తుండడంతో అధిష్టానం పెద్దలపై విమర్శలు వస్తున్నాయి. వైసిపిని మించి టిడిపి మైనింగ్ రాజకీయాలు చేయడానికి సిద్ధమైనట్లు కనిపిస్తోంది. ఇలాగే జరిగితే అధికారపార్టీ ప్రతిష్ట మంటగలవడం ఖాయమనిపిస్తోంది..

- గూడూరు, నెల్లూరు పెద్దల సిగపట్లు
- అధికారపార్టీలో మైనింగ్ అగ్గి
- చినబాబు వద్ద చర్చ

**ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి**

సైదాపురం తెల్లరాయి దోపిడీలో వైసిపి పద్ధతులనే టిడిపి నేతలు ఆచరిస్తున్నట్లు కనిపిస్తోంది. జిల్లా వ్యాపితంగా ఇదే రచ్చ జరుగుతోంది. వైసిపి ప్రభుత్వంలో సిఎం కార్యాలయం నుంచి మంత్రులు, ఎంఎల్‌ఎలు, నేతలు అడ్డంగా దోచుకున్నారు. లీజ్ దారులను బెదిరించి, ఆరాచకాలు చేశారు. ఇష్టావచ్చా..చస్తావా అంటూ బెదిరింపులకు దిగారు. మైనింగ్, పోలీస్, రెవెన్యూ, రవాణా శాఖ అధికారులు వత్తాసు పలికారు. టిడిపి ప్రభుత్వం వస్తే తమ భూములతోపాటు, లీజు దక్కుతుందని మైనింగ్ లీజ్‌దారులు ఆశపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పరిస్థితులు భిన్నంగా ఏమీ కనిపించడం లేదు. ఇప్పటి వరకు మైనింగ్ పాలసీ ప్రకటించలేదు. ఇప్పటికే పలుమార్లు మంత్రి కొల్లు రవేంద్రను కలిసి లీజు దారులు విజ్ఞప్తి చేశారు. ఇదిగో, అదిగో అంటూ కాలం వెళ్లబుచ్చడంతో లీజ్‌దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైసిపి ప్రభుత్వంలో తెల్లరాయి కుంభకోణంతోనే విభేదాలు వచ్చి పార్టీ నిండా ముంచింది. కూటమి అధికారంలో వచ్చిరాగానే నేతలు తెల్లరాయిపై పడ్డారు. ఇటీవల నెల్లూరు నగరానికి చెందిన ఓ నేతలకు నాలుగు క్వార్జ్‌లు లీజ్ మంజూరుచేసినట్లు తెలిసింది. సైదాపురంలో రెండు, రెట్టపల్లి, ఉదయగిరిలో ఇచ్చినట్లు సమాచారం. మీడియాలో వార్తలు రావడంతో తాత్కాలికంగా నిలుపుదల చేసినట్లు సమాచారం. నెల్లూరులోని టిడిపి పెద్దలకు కలిసి సమాచారం లేకుండా నేరుగా రాజధాని నుండే ఫైళ్ళ, మాటలు సాగుతుండడంతో మాకు సంబంధం లేకుంటా పార్టీ పెద్దలు తప్పుకుంటున్నారు. ప్రస్తుతం వైసిపి నుంచి ఎన్నికలకు ముందు వచ్చిన ఇద్దరు నేతలు పాత్రపైనే పార్టీలో చర్చసాగుతోంది. ధైర్యం చేసి చంద్రబాబునాయుడు, లోకేష్‌కు చర్చకు పెట్టేందుకు నాయకులు భయపడుతున్నారు. ప్రజలు మాత్రం వైసిపితోపాటు టిడిపి దొందూ దొందే అన్న ప్రచారం సాగుతోంది.

**నెల్లూరు, గూడూరు పెద్దల సిగపట్లు..!**

సైదాపురం తెల్లరాయి కోసం టిడిపిలోని నెల్లూరులోని ఇద్దరు నేతలు, గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి ఎంఎల్‌ఎలు, నేతలు సిగపట్లు పడుతున్నారని సమాచారం. "గత ప్రభుత్వంలో అందరూ కలిసి చేసుకున్నారు, మన ప్రభుత్వంలో మాకు తెలియకుండా ఎవరికో మైనింగ్ చేసుకోదానికి వస్తున్నారు" అని ఎంఎల్‌ఎలు వాపోతున్నట్లు సమాచారం. నెల్లూరు జిల్లాలో గత ఎన్నికల్లో ఖర్చుపెట్టిన నేతకు మైనింగ్ ఇస్తున్నారని, మా మూడు నియోజకవర్గాలకు భారీగా ఖర్చుచేసిన మా నాయకుని పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. మాకు తెలియకుండా మా నియోజకవర్గం నుంచి ఒక్కలారీ వెళ్లడానికి ఒప్పుకోమంటూ హెచ్చరికలు జారీ చేస్తున్నట్లు తెలిసింది. జిల్లేడు కడపకు చెందిన ఓ వ్యక్తి ఇక్కడ మైనింగ్ చేస్తుండడంతో స్థానిక నేతల ఫిర్యాదుతో అరెస్ట్ చేసి సైదాపురంలో పెట్టారు. తెల్లరాయి వ్యవహారం నెల్లూరులో ఇద్దరు నేతలు, తిరుపతి జిల్లాలో ముగ్గురు ఎంఎల్‌ఎలు మధ్య అగ్గిరాజేస్తుంది. తిలా పాపం...తలా పిడికెడు పంచుకున్నట్లు తెల్లరాయిని అధికారపార్టీ నేతలు పంచుకోవడానికి సిద్ధమయ్యారు. ఎన్నో ఏళ్లుగా మైనింగ్‌ను నమ్ముకొని వ్యాపారాలు చేస్తున్న లీజు దారులు 2019 తరువాత నుంచి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వంలోనే అనేక కష్టాలు పెట్టించారు, కొత్త ప్రభుత్వంలోనైనా తమ బాధలు తీరుతాయని ఆశపడ్డ వారు మరింతగా దిగాలు పడుతున్నారు. వైసిపిని మించి టిడిపి వ్యవహరిస్తుందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పార్టీ పెద్దలు జోక్యం చేసుకొని న్యాయం చేయాలని కోరుతున్నారు. సహజవనరులు ప్రభుత్వానికి చెందాలి. అలా కాకుండా ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆపార్టీ నేతలు ఫలహారంలా పంచుకుతినడం పట్ల ప్రజల్లో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు..

# ఫెడరల్ వ్యవస్థను పరిరక్షించుకుందాం..!

## కేరళపై కేంద్ర ప్రభుత్వం వివక్షత చూపడం సరికాదు - రౌండ్‌టేబుల్ సమావేశంలో ప్రజా సంఘాలు

**ప్రజాశక్తి-నెల్లూరు**

కేంద్రంలో బిజెపి ప్రభుత్వం రాష్ట్రాల అధికారాలను హరించి వేస్తుందని, రాజ్యాంగం ప్రసాదించిన ఫెడరల్ వ్యవస్థకు తూట్లు పొడుస్తుందని, తన విదానాలకు అనుగుణంగా లేని రాష్ట్ర ప్రభుత్వాల పట్ల తీవ్రమైన వివక్షత చూపిస్తుందని ప్రజా సంఘాల విమర్శించారు. బుధవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కేరళ రాష్ట్ర ప్రభుత్వం పట్ల కేంద్రం చూపిస్తున్న వివక్షతపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ రౌండ్‌టేబల్ సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ కేంద్రం రాష్ట్రం, ఉమ్మడి జాబితాలో ఉన్న చట్టాలను అమలు చేయకుండా, కేంద్ర ప్రభుత్వమే నేరుగా చట్టాలను మొండిగా అమలు చేస్తుందన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు భంగం కలిగించే విధంగా జిఎస్‌టి అమలు చేస్తు రాష్ట్రానికి చెల్లించాల్సిన వాటాను చెల్లించకుండా నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తుం దన్నారు. కేరళలో మతోన్మాద విధానాలను అమలు చేయలేదని కారణంగా ఆ రాష్ట్రానికి న్యాయ పరంగా అందజేయాల్సిన వాటాను అందజేయకుండా అభివృద్దిని అడ్డుకునేందుకు కుట్రపూరితంగా వ్యవహరిస్తుం దన్నారు. కేరళలో ప్రకృతి సృష్టించిన బీభత్సంలో వయనాడు ప్రాంతంలో సంభవించిన తీవ్రత వల్ల మరణించిన వారి కుటుంబాలకు ఆదుకొనేందుకు ఎటువంటి ప్రయత్నం చేయలేదన్నారు. కేరళ రాష్ట్రంలో పర్యటించిన సమయంలో ప్రధాని నరేంద్రమోడీ కేంద్రం నుంచి సహాయం చేస్తామని, ఆర్భాటంగా ప్రకటనలు చేశారే తప్ప అమలుకు టువంటి చర్యలు తీసుకోలేదన్నారు. కేరళలో అధికారంలో ఉన్న వామపక్ష ప్రభుత్వాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. ఆ రాష్ట్ర ప్రజలకు జిల్లా వామపక్ష , ప్రజా సంఘాలు సంఘీభావం తెలియజేస్తూ ,రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్న బిజెపి ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టే కార్యక్రమాల్లో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానించింది. రాజ్యాంగంలోని ఫెడరల్ స్పూర్తికి భంగం కలిగిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం అధికారాలను కాలరాస్తూ, కేంద్ర ప్రభుత్వ అధికార కేంద్రీకరణకు 2020లో తెచ్చిన వ్యవసాయ నల్ల చట్టాలను, ఎలక్ట్రిసిటీ బిల్లులను, విద్యా చట్టాలను, కార్మిక చట్టాలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎపి రైతు సంఘం ఉపాధ్యక్షులు చంద్ర రాజగోపాల్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పి.శ్రీరాములు, జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య, ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులుజొన్నలగడ్డ వెంకమరాజు, సిఐటియు జిల్లా కార్యదర్శి కె.అజయ్‌కుమార్, జిల్లా అధ్యక్షులు టి.వి.వి ప్రసాద్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి తుళ్లూరు గోపాల్, సిఐటియు నాయకులు ఎస్‌కె రెహనాబేగం, జి.నాగేశ్వరరావు, కె .పెంచలనర్సయ్య, రాజా ఉన్నారు.

రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

## భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం : ఇంటూరి

**ప్రజాశక్తి -వలేటివారిపాలెం**

రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపనున్నట్లు ఎంఎల్‌ఎ ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం వలేటివారిపాలెం గ్రామ సచివాలయంలో జరిగని రెవెన్యూ సదస్సుకు ఎంఎల్‌ఎ ఇంటూరి నాగేశ్వ రరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ'మీ భూమి- మీ హక్కు' పేరుతో డిసెంబర్ 6 నుంచి జనవరి 8 వరకు రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. గతంలో వైసిపి ప్రభుత్వం రీ సర్వే పేరిట ల్యాండ్ మాఫియాకు పాల్పడిందని విమర్శించారు. స్పెషల్ ఆఫీసర్ ఎం శ్రీనివాసరావు కె కుదవాన్, మండల ఎమ్మార్వో హమీద్ ఇతర రెవెన్యూ అధికారులు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, గ్రామ పార్టీ అధ్యక్షుడు కాకుమాని ఆంజనేయులు, కె హర్ష వలేటి నరసింహం, చెరువుపల్లి మాల్యాద్రి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు

## పారిశుధ్య నిర్వహణ పనులు పరిశీలన

**ప్రజాశక్తి-నెల్లూరు**

ప్రధాన మార్గాలకు ఇరువైపులా ఉన్న బహిరంగ ప్రదేశాల్లో స్థానికులు వ్యర్థాలు వేయకుండా, ఇప్పటికే ఉన్న వ్యర్థాలను వెంటనే తొలగించేలా పారిశుధ్య విభాగం అధికారులు పర్యవేక్షించాలని నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. బుధవారం స్థానిక 1వ డివిజన్ కోడూరుపాడు ప్రాంతంలో పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా కమిషనర్ పర్యటించారు.కమిషనర్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలో పారిశుధ్య పనుల నిర్వహణకు అవసరమైన వాహనాలను వెంటనే సమకూర్చాలని అధికారులను ఆదేశించారు. డివిజన్ వ్యాప్తంగా రోడ్లపై ఉన్న గోతులను మరమ్మతు చేసేలా వెంటనే చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. స్థానికంగా నిర్మించి ఉన్న ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ ను కమిషనర్ పరిశీలించారు. ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ చైతన్య, ఇంజనీరింగ్ విభాగం అధికారులు, సచివాలయం ఎమెనిటీస్ కార్యదర్శులు పాల్గొన్నారు.

## క్షయవ్యాధి నివారణపై సమీక్ష

**ప్రజాశక్తి-నెల్లూరు**

జిల్లాలోని ప్రయివేట్ వైద్యులు టి.బి.కేసులు గుర్తించి పిపిఎస్‌ఏ భవ్య ఫీల్డ్ కోఆర్డినేటర్‌కు తెలియజేయాలని, అటువంటి కేసులను ఎన్‌ఐకెఎస్‌హెచ్‌వై పోర్టల్లో నమోదు చేయాలని జిల్లా లెప్రసీ ఎయిడ్స్ టీబి అధికారి డాక్టర్ ఎస్ కే ఖాదరవల్లి పేర్కొన్నారు. బుధవారం నగరంలోని డిఎల విభాగంలో పిపిఎస్‌ఏ భవ్య ఎన్‌జివో, టి.బి.నివారణ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. డిఎల్‌ఎటిఒ డాక్టర్ ఎస్ కె ఖాదరవల్లి మాట్లాడుతూ ప్రతి ఒక్క ప్రయివేట్ డాక్టరు టీబి కేసుల నీ గుర్తించాలని, గుర్తించిన టీబి కేసులను పిపిఎస్‌ఏ భవ్య ఫీల్డ్ కోఆర్డినేటర్స్ కి తెలియజేయాలని, తద్వారా గుర్తించిన క్షయ కేసులను ఎన్‌ఐకెఎస్‌హెచ్‌వై పోర్టల్లో నమోదు చేస్తారని తెలిపారు.భవ్య ఎన్‌జిఒ డిస్టిక్ కో ఆర్డినేటర్ తులసిరాం, పి పిఎం కోఆర్డినేటర్ హరీష్ ఉన్నారు.

## ధర్నాను జయప్రదం చేయండి : వైసిపి

**ప్రజాశక్తి-కందుకూరు :** రాష్ట్రంలో రైతన్నలకు గిట్టుబాటు ధర కల్పించాలని, రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని కోరుతూ ఈనెల 13న రాష్ట్ర వ్యాప్తంగా వైసిపి ఆధ్వర్యంలో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ 'అన్నదాతకు అండగావైసిపి' పేరుతో రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. స్థానిక వైసిపి కార్యాలయంలో ఆ పార్టీ సీనియర్ న్యాయవాది ముప్పవరపు కిషోర్ , జెసిఎస్ కో ఆర్డినేటర్ వెలిచెర్ల ధనకోటి, ఎస్‌సి సెల్ ఉపాధ్యక్షులు రేణమాల అయ్యన్న, వైసిపి నాయకులు వాకా శ్రీనివాసులు రెడ్డి,గోగినేని రామాంజనేయులు, షేక్ రహీం, షేక్ అబ్దుల్ కలాం, గుత్తికంటి యోగేశ్వరరావు, జంగిలి ఇస్రాయేలు, శ్రీరామ. కుమా రస్వామి, తలారి ప్రసన్న కుమారి, దేవరకొండ ఆదిలక్ష్మి,గుడిమెట్ల ప్రసన్న కుమార్ పాల్గొన్నారు. 13న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో కందుకూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ నాయకత్వంలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

**ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు :**పశువులకు సీజనల్ వ్యాధులు రాకుండా రైతులు అప్ర మత్తంగా ఉండాలని పశుసంవర్ధక శాఖ సహాయ సంచా లకులు డాక్టర్ బి. మురళి కృష్ణ సూచించారు. బుధవా రం తోటపల్లిగూడూరు మండలం చిన్నచెరుకూరు గ్రా మంలో పశుసంవర్ధక శాఖ సహకారంతో, స్వర్ణభారతి-మండవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం జరిగింది. పశువైద్య శిబిరంలో డాక్టర్ మురళికృష్ణ, ముఖ్య అతిథిగా ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు సీజనల్ వ్యాధులు ప్ర బలకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు.దూడలకు నట్టల నివారణ మందులు తాగించారు. కార్యక్రమంలో డాక్టర్ ఓ శ్రీనివాసులు, డాక్టర్ వి. శ్రీనివాసులు నా యుడు, డాక్టర్ ప్రవీణ్,డాక్టర్ నగేష్, డాక్టర్ నాగేంద్ర, మండవ ఫౌండేషన్ ప్రతినిధులు, పశువైద్యులు పాల్గొన్నారు.

# 'రాళ్లపాడు' కుడి కాలువ తూముకు మరమ్మతులు

## ఎంఎల్‌ఎలు ఇంటూరి, కాకర్ల పరిశీలన - ఆందోళన చెందొద్దని రైతులకు భరోసా

చీకట్లోనూ పనులు చేస్తున్న ప్రాజెక్టు సిబ్బంది

**ప్రజాశక్తి - లింగసముద్రం**

రాళ్లపాడు ప్రాజెక్టు కుడి కాలువ నీరు విడుదల చేసే గేటు దెబ్బతిని మరమ్మత్తులును మంగళవారం అర్ధరాత్రి ఎంఎల్‌ఎ ఇంటూరి నాగేశ్వరరావు పరిశీలించి అధికారులకు,గేటు రిపేరు చేసే సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రాజెక్టు సిబ్బంది గేటును తెరిచేందుకు తీవ్ర ప్రయత్నాలు చేసినప్పటికీ ఎలాంటి ఫలితం కనిపించలేదు. దీంతో బుధవారం విజయవాడ నుండి భారీ రోప్‌లను తీసుకువచ్చే ప్రాజెక్టు సిబ్బంది ప్రయత్నించారు.ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ తో కలిసి మరోసారి ప్రాజెక్టు గేటు మరమ్మత్తు పనులను పరిశీలించారు. ప్రాజెక్ట్ లోని మిగతా గేట్లు పనితీరును వివరాలను అధికారులు అడిగి ఎమ్మెల్యేలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు ఇద్దరు అధికారులతో మాట్లాడి పనుల పురోగతిని గురించి అడిగి తెలుసుకున్నారు.. గేటు మరమ్మత్తులు చేయడంలో నిపుణులు భాషా తో పాటు వారి సిబ్బందితో మాట్లాడారు.గేటు మరమ్మత్తులను త్వరగా పూర్తి చేసే విధంగా చూడాలని భాషకు సూచించారు.ఈ సందర్భంగా ప్రాజెక్టు వద్దకు చేరుకున్న రైతులతో మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్ లో పుష్కలంగా పొలాలు నీరు విడుదల చేస్తామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు,కాకర్ల సురేష్ రైతులకు భరోసా ఇచ్చారు. విరిగి పడిన తూము గేటును తెరిచేందుకు అధికారులు ప్రాజెక్టు సిబ్బంది తీవ్ర ప్రయత్నాలు చేస్తూ శ్రమిస్తున్నప్పటికీ ఎలాంటి పురోగతి లేదు.బుధవారం మధ్యాహ్నం నుండి ఇరువురు ఎమ్మెల్యేలు పనులు పూర్తి చేసి రైతులకు నీటిని విడుదల చేసిన తర్వాత వెళ్లాలని నిర్ణయించుకున్నారు.అక్కడే ఉండి పనులను పరిశీలించారు. అంతకుముందు తూము పరిస్థితిని జల వనరుల శాఖ ఉన్నతాధికారులకు శాసనసభ్యులు నాగేశ్వరరావు వివరించారు.నారులు పోసుకొని వరి నాట్లుకు సిద్ధంగా ఉన్న రైతులకు నీరు రాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

అధికారులతో మాట్లాడుతున్న ఇంటూరి,కాకర్ల

## ఎల్‌ఐసి ఏజెంట్ల మహాధర్నా

**ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి**

ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఏజెంట్స్ పెడరేషన్ ఆఫ్ ఇండియా పిలుపుమేరకు, నెల్లూరు డివిజన్ ఆధ్వర్యంలో దర్గామిట్ట డివిజన్ ఆఫీస్ ఎదుట బుధవారం నెల్లూరు, చిత్తూరు, ప్రకాశం మూడు జిల్లాల నుంచి వేలాదిమంది ఏజెంట్ల మహాధర్నా కార్యక్రమాన్ని చేపటి నిరసనను తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో సౌత్ సెంటర్ జోన్ అధ్యక్షులు కె. వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ 1956లో చిన్న సంస్థగా ప్రారంభమైన ఎల్‌ఐసి నేడు దేశంలోనే అగ్రగామిగా నిలిపిన దానిలో క్రియాశీలకంగా వ్యవహరిస్తుందన్నారు. 14 లక్షల మంది ఏజెంట్ల కృషి ఎంతో ఉందన్నారు. అలాంటి ఏజెంట్ల వ్యవస్థను నీరుగార్చే విధంగా ఎల్‌ఐసి మేనేజ్‌మెంట్ తీసుకున్న నిర్ణ యాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నేడు నిరసన కార్యక్రమాలు చేస్తున్నా మన్నారు. ఏజెంట్ల బెనిఫిట్స్‌ని పాత పద్ధతిలో కొనసాగించాలని, క్రో బ్యాక్ రద్దు చేయాలని ఎల్‌ఐసి పాలసీలపై జిఎస్‌టిలని ఎత్తివేయాలని, ,ప్రతి ఒక్కరికీ ఎల్‌ఐసి పాలసీ అందుబాటులో వచ్చే విధంగా మినిమం ఒక లక్ష ఇచ్చే విధంగా ఏర్పాటు చేయాలన్నారు.కార్యక్రమం డివిజన్ ప్రెసిడెంట్ సుబ్బారావు, డివిజన్ జనరల్ సెక్రటరీ సతీష్ బాబు, ట్రెజరర్ జావీద్ నాయకత్వం వహించారు. ముఖ్య అతిథిగా జోనల్ వైస్ ప్రెసిడెంట్ కె. మాల్యాద్రి, డివిజన్ గౌరవాధ్యక్షులు తూపిలి శ్రీధర్ రెడ్డి, డివిజన్ జాయింట్ సెక్రెటరీ ఎస్. వీరస్వామి, నెల్లూరు, చిత్తూరు, ప్రకాశం జిల్లా సెక్రటరీలు, జిల్లా ప్రెసిడెంట్లు, క్లైయిం డివిజన్ సెక్రెటరీ బాబురావు, డివిజన్ సెక్రటరీ షాహుల్, జిల్లా సెక్రటరీ మధుసూదన్ పాల్గొన్నారు.

ఎల్‌ఐసి ఆఫీసు ఏదుట ధర్నా చేస్తున్న ఏజెంట్లు

## ఇస్రోలో ప్రయివేటు భాగస్వామ్యం ఎంత?

**సభలో విపిఆర్**

**ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి**

భారత అంతరిక్ష రంగంలో గత ఐదేళ్లలో ప్రయివేటు రంగ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలను తెలియజేయాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కోరారు. బుధవారం లోక్‌సభలో ఆయన పలు అంశాలపై వివరాలు ఆరా తీశారు. ఇస్రోతో భాగస్వామ్యం కలిగున్న ప్రయివేటు కంపెనీల జాబితాను తెలియజేయాలని కోరారు. గత ఐదేళ్లలో దేశంలో అంతరిక్ష పరిశోధనలు, సాంకేతికతకు సంబంధించి ఇస్రోతో అనుసంధానమై పనిచేస్తున్న ప్రయివేట్ కంపెనీలు నమోదు చేసిన మొత్తం ఆవిష్కరణలపై వివరాలు అడిగారు. వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నలకు ప్రధానమంత్రి కార్యాలయ సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్లు సహాయ శాఖ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు. ఇండియన్ స్పేస్ ప్రోగ్రాం ప్రారంభం నుంచి పరిశ్రమ భాగస్వామ్యం వెన్నుదన్నుగా ఉందని పేర్కొన్నారు. ప్రయోగ వాహనం, ఉపగ్రహాలు రెండింటికీ సంబంధించిన పదార్థాలు, ఉప- వ్యవస్థలను ఉత్పత్తి చేయడానికి మన ఇస్రో స్వయం సమృద్ధి సాధించిందని వివరించారు. ఇస్రో, ప్రయివేట్ కంపెనీల మధ్య అంతరిక్షానికి సంబంధించి ఎలాంటి భాగస్వామ్య ప్రాజెక్టులు లేవన్నారు.

## కందుకూరులో.. నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయండి

**కేంద్ర మంత్రికి ఎంపి 'వేమిరెడ్డి' విజ్ఞప్తి**

**ప్రజాశక్తి-కందుకూరు**

కందుకూరులో సుమారు 50 ఏళ్ల కిందట ఏర్పాటు చేసిన ఖాదీ కార్యాలయం శిధిలావస్థకు చేరిందని, దాని స్థానంలో ఖాదీ,గ్రామ పరిశ్రమల కోసం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్యస్థ పరిశ్రమల శాఖమంత్రి జితన్ రామ్ మాంఝీని కలిసి విన్నవించారు. ఈ మేరకు బుధవారం ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో కేంద్రమంత్రిని కలిసిన ఎంపి వేమిరెడ్డి ఆయన్ను శాలువాతో సత్కరించారు. అనంతరం వివిధ అంశాలపై ఆయనతో చర్చించారు. చేనేత కార్మికుల స్వావలంబన లక్ష్యంతో సుమారు 50 ఏళ్ల కిందట నెల్లూరు జిల్లా గ్రామ స్వరాజ్య సంఘం పేరుతో కందుకూరులో ఖాదీ కార్యాలయం ఏర్పాటయిందన్నారు. ప్రస్తుతం ఆ భవనం నిరుపయోగంగా మారిం దన్నారు..ఈ నేపథ్యంలో పాత ఖాదీ కార్యాలయం స్థానంలో ఖాదీ , గ్రామ పరిశ్రమల కోసం స్కిల్ డెవల ప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. ప్రధానమంత్రి విశ్వకర్మ కౌశల్ యోజన కింద కందకూరులో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.

మంత్రితో చర్చిస్తున్న ఎంపి వేమిరెడ్డి

## తాగునీటి సమస్యకు పరిష్కారం

**ప్రజాశక్తి వార్తకు స్పందన**

**ప్రజాశక్తి -గుడ్లూరు రూరల్ :**మండలంలోని జానకంపేటలో పైప్‌లైన్లకు మరమ్మత్తులు చేయరూ.. అనే శీర్షికన మంగళవారం ప్రజాశక్తిలో కథనం ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో బుధవారం గుడ్లూరు మండలం ఎంపిడిఒ వై వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు జానకంపేట సర్పంచ్ మొగిలి శివపార్వతి వెంటనే జానకంపేట గ్రామానికి వెళ్లారు. ఎస్‌టి కాలనీలో పగిలిపోయిన పైప్లైలను తొలగించి కొత్త పైపున్ జాయింట్ చేసి మరమ్మతులు చేశారు. దీంతో నీటి సమస్యకు పరిష్కారం లభించింది. దీనిపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఎంపిడిఒ వెంకటేశ్వరరావు, సర్పంచ్ శివపార్వతిలకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

## యజమానులకు సూచనలు

**ప్రజాశక్తి-నెల్లూరు :**ప్రధాన రహదారులపై వాహనదారులకు అడ్డంకిగా ఉంటున్న పశువులను గోశాలకుతరలిస్తామని, వాటి యజమానులు బాధ్యత వహించకపోతే చర్యలు ఉంటాయని నగరపాలక సంస్థ వెటర్నరీ వైద్య అధికారి డాక్టర్ మదన్ మోహన్ హెచ్చరించారు. బుధవారం పశువులను గోశాలకు తరలించే స్పెషల్ డ్రైవ్ లో భాగంగా ట్రంక్ రోడ్డు ప్రాంతంలో పశువుల యజమానులతో ఆయన మాట్లాడారు.

## రహదారులకు మరమ్మతులు

**ప్రజాశక్తి-నెల్లూరు :**నగర వ్యాప్తంగా ప్రధాన రోడ్లపై జరుగుతున్న మరమ్మతు పనులను వేగవంతం చేయాలని కమిషనర్ సూర్య తేజ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. స్థానిక గాంధీ నగర్ రోడ్డు, కరెంట్ ఆఫీస్ సెంటర్ ప్రధాన రోడ్లపై జరుగుతున్న ప్యాచ్ వర్క్ పనులను కమిషనర్ పర్యవేక్షించారు.గాంధీ నగర్ మున్సిపల్ పార్కులో జరుగుతున్న అభివద్ధి పనులను తనిఖీ చేశారు. పర్యటనలో భాగంగా మాగుంట లేఅవుట్ ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ వీధిలైట్లను కమిషనర్ పరిశీలించారు. అనంతరం సంతపేటలోని పాత మార్కెట్ ను తనిఖీ చేశారు. నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, పట్టణ ప్రణాళిక విభాగం, రెవెన్యూ విభాగం అధికారులు పాల్గొన్నారు.

## 16న చేపల చెరువులకు వేలం

**ప్రజాశక్తి -గుడ్లూరు రూరల్ :**మండలంలోని చిన్నలటారిపి గ్రామంలో చెరువులు వేలం పాట ఈనెల 16న ఉదయం 11 గంటలకు ఆ గ్రామ సచివాలయంలో జరుగుతుందనిగ్రామ సచివాలయ సెక్రటరీ తుళ్లూరు రవీంద్ర బుధవారం వెల్లడించారు. 2024-2025 సంవత్సరానికి నల్లచెరువు, ఎర్ర ఊర చెరువులకు ఇఒపిఆర్‌డి, సర్పంచ్ మొగిలి శివ పార్వతి ఆధ్వర్యంలో వేలం జరుగుతుందని తెలిపారు. వేలంపాటలో పాల్గొనదలచిన వారు రూ. వెయ్యి ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

టి. రవీంద్ర, పంచాయతీ కర్యాదర్శి

## సోమిరెడ్డి ప్రమాణానికి సిద్ధమా : కాకాణి

**ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి :**సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నియోజకవర్గ కంపెనీలతో పాటు, రాష్ట్రంలోని కంపెనీలపై దండయాత్ర మొదలెట్టారని మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల సోమిరెడ్డి అరబిందో సంస్థను, విజయసాయిరెడ్డిపై విమర్శలు చేస్తున్నారన్నారు. గత ఎన్నికల్లో అరబిందో కంపెనీని ఆయన రూ.5 కోట్లు అడిగారని, తన దగ్గర సమాచారం ఉందని ఆరోపించారు. దీనిని నిరూపించడానికి తాను సిద్ధంగా ఉన్నానని, ఆయన సిద్ధంగా ఉన్నారా అని అడిగారు. అవసరమైతే విజయసాయిరెడ్డి వస్తారని తెలిపారు. ఇరిగేషన్ అధికారులు, ఇంజనీర్లను ఆయన డబ్బులు డిమాండ్ చేస్తున్నారన్నారు. సోమిరెడ్డి విజిలెన్స్ అధికారులను ఇంటికి పిలిపించి, బెదిరించి నివేదికలు తయారు చేయిస్తున్నాడు.పొదలకూరు మండలంలో నా బినామీలు అక్రమ లే అవుట్లు వేశారని సోమిరెడ్డి గతంలో ఆరోపించారని, నిరూపించాలని డిమాండ్ చేశారు.

## ఆహార నాణ్యతా ప్రమాణాలను పాటించాలి

**ప్రజాశక్తి -నెల్లూరు :**నగర పాలక సంస్థ పరిధిలోని హోటల్లు, హాట్ ఫుడ్ సెంటర్లు,రెస్టారెంట్లలో ఆహార నాణ్యతా ప్రమాణాలను విధిగా పాటించాలని జిల్లా ఫుడ్ సేఫ్టీ విభాగం, నగరపాలక హెల్త్ విభాగం కలిసి నగరంలోని హోటల్లు రెస్టారెంట్ల నిర్వహకులకు అవగాహనా సదస్సును కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో బుధవారం కమీషనర్ సూర్యతేజ నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ హోటళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.కిచన్ ప్రాంతంలో అత్యంత పరిశుభ్ర వాతావరణం ఉండేలా ప్రతిరోజూ నిర్వహణ చేపట్టాలని సూచించారు. శాఖాహారం, మాంసాహారం పదార్థాలను విడివిడిగా ఉంచుకోవాలని సూచించారు. ఫుడ్ సేఫ్టీ అధికారి జి.వెంకటేశ్వర రావు, నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ నందన్, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ చైతన్య, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, నగరంలోని ప్రముఖ హోటళ్ల నిర్వాహకులు పాల్గొన్నారు.

## ఉద్యమ్ రిజిస్ట్రేషన్‌పై అవగాహన కల్పించండి..

మాట్లాడుతున్న ఎంపిడిఒ

**ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్**

సూక్ష్మ, చిన్న, మధ్య తరగతి తరహా పరిశ్రమలు, షాపులు నిర్వహించుకునే వారికి ఉద్యమ్ రిజిస్ట్రేషన్‌పై అవగాహన కల్పించి వాటిని నమోదు చేయించేలా చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ ఐజాక్‌ప్రవీణ్ సచివాలయ సిబ్బందికి తెలిపారు. బుధవారం మండలంలోని బట్టేపాడు, అప్పారావుపాలెం సచివాలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బంది బయోమెట్రిక్ హాజరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సచివాలయాల్లో నిర్వహిస్తున్న సర్వేలను క్రమపద్ధతిలో త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఇంటి పన్నుల వసూలుకు సంబంధించి ఆన్‌లైన్ ప్రక్రియను మండలంలో నూరుశాతం పూర్తి చేశారన్నారు. ఎంఎస్‌ఎంఇ సర్వేను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఉద్యమ్ రిజిస్ట్రేషన్ ప్రక్రియకు సంబంధించి ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రభుత్వ పథకాల ద్వారా తాము నిర్వహించే సంస్థలను అభివృద్ధి చేసేందుకు ఈ రిజిస్ట్రేషన్ ఉపయోగపడుతుందన్నారు. అదే విధంగా అర్హులైన వారు ఎవరైనా హౌస్ హోల్డ్ మ్యాపింగ్‌లో నమోదు కాకుంటే వారిని గుర్తించి మ్యాపింగ్ చేయాలన్నారు. అదేవిధంగా బట్టేపాడు సచివాలయంలో జరుగుతున్న ఆధార్ క్యాంపును పరిశీలించారు. ఆయనవెంట ఇఒపిఆర్‌డి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

## 13న కలెక్టరేట్ ఎదుట ధర్నా

**ప్రజాశక్తి-కావలి** : రైతులను దగా చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీస్తూ 13వ తేదీన జిల్లా కలెక్టరేట్ ఎదుట వైసిపి ఆధ్వర్యంలో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కావలి మాజీ ఎంఎల్‌ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం ఆయన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులను ఆదుకుంటానంటూ గద్దెనెక్కిన చంద్రబాబు రైతులను పట్టించుకోలేదన్నారు. అన్నదాతా! సుఖీభవ! అని చెప్పి, రైతుకు ఏడాదికి రూ.20వేలు ఇస్తామన్న సూపర్ సిక్స్ హామీ తుంగలో తొక్కారన్నారు. జగనన్న హయాంలో ప్రతియేటా రైతుభరోసా ఇస్తే, బాబు రైతు భరోసా ఇవ్వకుండా రైతులను మోసం చేస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వ నమ్మక ద్రోహాన్ని నిలదీయాలన్నారు. పండించిన పంటలో 75 కేజీల బస్తా కనీస మద్దతు ధర రూ.1725 కాగా, ప్రస్తుతం రూ.1300 మాత్రమే వస్తుందన్నారు. ఉచిత పంటల బీమా రద్దు చేశారని ఆరోపించారు. రైతు సమస్యల పరిష్కారం కోసం 13న జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఆయన రైతులకు పిలుపునిచ్చారు. సమావేశంలో వైసిపి నాయకులు కేతిరెడ్డి శివకుమార్ రెడ్డి, దామిశెట్టి సుధీర్‌నాయుడు, గుద్దుటి మాల్యాద్రి, ఎగురు చిన్నపుల్లయ్య, గంధం ప్రసన్నాంజనేయులు, అక్కిలగుంట మాల్యాద్రి, జంపాని రాఘవులు, పైనంపాటి జగదీశ్, మందటి కృష్ణారావు, నాయబ్ రసూల్, కృష్ణారెడ్డి, తదితర నాయకులు పాల్గొన్నారు.

## అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

**ప్రజాశక్తి-అల్లూరు** : మండల పరిధిలోని మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ అభివృద్ధి ప్రణాళికపై బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అన్నిగ్రామ పంచాయతీల్లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల పురోగతిలో సాధించడానికి, ఆ లక్ష్యాలు సాధించడానికి అవసరమయ్యే ప్రణాళిక తయారు చేయడానికి కోసం ఉద్దేశించిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి సంస్థ అర్జునర్ రమేష్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలు సంపూర్ణంగా అభివృద్ధి చెందాలంటే గ్రామ పరిస్థితులకు అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలు తయారు చేసుకొని గ్రామాలను ఆరోగ్య పంచాయతీలుగా, మహిళా స్నేహపూర్వక పంచాయతీలుగా, బాల స్నేహపూర్వక పంచాయతీలుగా తీర్చిదిద్దాలని తెలిపారు. గ్రామంలో పేదరిక నిర్మూలన జీవనోపాధుల కల్పన సంకల్పాలతో, ప్రణాళికలతో గ్రామపంచాయతీలు ముందుకు సాగాలని కావలి డివిజనల్ పంచాయతీ అధికారి మాధవీలత పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపిపి దర్శనంలు శశికల, ఎంపిడిఒ రజనీకాంత్, విస్తరణ అధికారి పెంచలవీరేంద్ర, ఆయా గ్రామ సర్పంచులు, సచివాలయ సిబ్బంది, మండల అధికారులు పాల్గొన్నారు.

## రిజిస్టర్‌లో నమోదు చేయాలి

**ప్రజాశక్తి-ఉదయగిరి** : స్వీయ మదింపు టర్మ్ -1 జవాబు పత్రాలను ఏ రోజుకారోజు మదింపు చేసి రిజిస్టర్లలో నమోదు చేయాలని ఎంఇఒ.1 షేక్ మస్తాన్‌వలీ పేర్కొన్నారు. బుధవారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల మాసాయిపేట మెయిన్, మాసాయిపేట హరిజనవాడ, మాసాయిపేట ఉర్దూ పాఠశాలలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వీయ మదింపు టర్మ్-1 పరీక్ష జవాబు పత్రాలను పరీక్ష అనంతరం ఈరోజుకారోజు మదింపు చేసి రిజిస్టర్లలో నమోదు చేయాలని తెలియజేశారు. మూడు పాఠశాలల్లో బోధన అభ్యసన సామాగ్రిని వాడి చక్కగా తయారుచేసిన విద్యార్థులను చేయించిన ఉపాధ్యాయినిలను జి.అనూరాధ, షేక్ అర్షియా, షేక్ హాజీరలను అభినందించారు. మరుగుదొడ్లు, తరగతి గదులు శుభ్రం చేయడానికి ప్రభుత్వం వారు సరఫరా చేసిన రసాయనాలను ప్రతిరోజు తప్పనిసరిగా ఉపయోగిస్తూ తరగతి గదులు మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాలని మూడు పాఠశాలల ఆయాలకు తెలియజేశారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పరీక్ష అనంతరం హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డ్‌లో మార్క్స్ నమోదు చేసి విద్యార్థుల ప్రగతిని తల్లిదండ్రులకు తెలియజేయాలని చెప్పారు.

## సర్వేకు సహకరించాలి

**ప్రజాశక్తి-ఉదయగిరి** : మండలంలోని సచివాలయ సిబ్బంది చేపడుతున్న ఎంఎస్‌ఎంఇ హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ సర్వేకు వచ్చిన సచివాలయ సిబ్బందికి సహకరించాలని ఎంపిడిఒ అప్పాజీ పేర్కొన్నారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ సర్వేకు వచ్చే సచివాలయ సిబ్బంది అవునా కాదో నిర్ధారించుకొని ఒటిపి చెప్పాలన్నారు. కేటగిరి-2 విద్యుత్ కనెక్షన్ ఉన్న ప్రతి ఒక్కరికీ ఈ సర్వే చేపడుతున్నామన్నారు. సర్వే చేయడం వల్ల ప్రతి ఇంట్లో ప్రభుత్వ పథకాలకు అర్హులవుతారని, ప్రభుత్వం అందించే ప్రతి పథకం చేకూరుతాయన్నారు. అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## అరుణాచలంకు ప్రత్యేక బస్సులు

**ప్రజాశక్తి-కావలి** : కార్తీకపౌర్ణమి సందర్భంగా కావలి నుండి అరుణాచలం గిరి ప్రదక్షిణకు వెళ్ళే భక్తుల కోసం ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు ఎపిఎస్ ఆర్‌టిసి, కావలి డిపో మేనేజర్ రాఘరు శ్రీనివాసులు తెలిపారు. ఈ బస్సులు డిసెంబర్ 14వ తేదీన కావలిలో బయల్దేరి సాయంత్రం అరుణాచలం చేరుతాయని, గిరిప్రదక్షిణ అనంతరం 15వ తేదీ అరుణాచలంలో బయల్దేరి కావలికి తిరిగి వస్తాయని ఆయన వివరించారు. టికెట్ ధర రూ.1400 మాత్రమే అని, ధర్మ దృష్టి భక్తులు ఈ సీట్లను ముందుగా రిజర్వేషన్ చేయించుకోవాలని, టికెట్ బుకింగ్ చేసుకోదలచిన వారు సర్వీస్ నెంబర్ : 94472 కోసం www.apsrtconline.inలో బుకింగ్ చేసుకోవాలన్నారు. లేదా కావలి బస్టాండ్‌లో రిజర్వేషన్ కౌంటర్‌లో బుకింగ్ చేసుకోవాలని, 36 టికెట్లు ఒకే బ్యాచ్‌లో ఉంటే వారికి ప్రత్యేక బస్సు ఏర్పాటు చేస్తామన్నారు. ఇతర వివరాలకు, 9849856498 (మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్) 9966009395 (అసిస్టెంట్ మేనేజర్) 9493913989 (ట్రాఫిక్ సూపరింటెండెంట్) ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు. కావున కావలి పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు, భక్తులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని డిఎం శ్రీనివాసులు కోరారు.

## బిట్రగుంటలో కార్డన్‌సెర్చ్

**ప్రజాశక్తి-బిట్రగుంట** : సామాన్య ప్రజలలో ధైర్యం నింపుతూ పోలీసు వ్యవస్థపై విశ్వాసం పెంచడానికి బిట్రగుంట పోలీస్ పరిధిలోని కప్పరాళ్ల తిప్ప, అల్లిమడుగు, సంగంలో గ్రామంలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషను కావలి డి.ఎస్.పి శ్రీధర్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్.పి. ఆదేశాల మేరకు బుధవారం బిట్రగుంటలో ఐదుగురు సిఐలు, 12మంది ఎస్ఐలు, 120 మంది పోలీస్ సిబ్బందితో కార్డెన్‌సెర్చ్ నిర్వహించామని తెలిపారు. కప్పరాళ్ల తిప్ప, సంగం, అల్లిమడుగు గ్రామాల్లో 480 ఇళ్లను తనిఖీ చేశామన్నారు. సరైన పత్రాలు లేని 47 బైకులు, 1 ఆటో, 1 అశోక్ లైలాండ్ బండిని స్వాధీనం చేసుకున్నామన్నారు. ముగ్గురు అనుమానితులను, రౌడీషీటర్, గుర్తించి అదుపులో తీసుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా సిఐలు అప్పారావు, రాజేశ్వరరావు, గిరిబాబు, ఫిరోజ్, వెంకటనారాయణ, ఎస్ఐలు బొజ్జానాయక్, సుమన్, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

ఎన్నికల ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఇఇ ఆర్.వెంకటేశ్వర్లు

**ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్**

ఆత్మకూరు డివిజన్ పరిధిలోని సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆత్మకూరు ఇరిగేషన్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆర్.వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం పట్టణంలోని జలవనరుల శాఖ కార్యాలయంలో ఎన్నికల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అనంతరం సామాగ్రిని సిద్ధం చేశారు. ఈ సందర్భంగా ఇఇ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆత్మకూరు నియోజకవర్గం లోని ఆరు మండలాలలో 59 సాగునీటి సంఘాలు 25,704 ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఉదయగిరి, సీతారామపురం మండలాల్లో 34 సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. గండిపాలెం ప్రాజెక్ట్ ఎన్నికల సైతం ఎన్నికలతో కలిపి నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్ని సాగునీటి సంఘాల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తెలిపారు. 14వ తేదీ ఆయా సాగునీటి సంఘాల పరిధిలో ఎన్నికలు జరగనున్నట్లు ఆరోజు ఉదయం 8 గంటల నుంచి పోలింగ్ ప్రారంభమై సాయంత్రం 5 గంటల లోపు పోలింగ్ ప్రక్రియ నిర్వహిస్తారన్నారు. ఆయా మండలాల తహశీల్దార్లు, ఎలక్షన్ ఆఫీసర్లు, పిఒలు, ఎపిఒలు ఈ ఎన్నికలు నిర్వహించేందుకు ఇప్పటికే శిక్షణ పూర్తి చేసుకొని ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎన్నికల సామాగ్రిని ఆయా సాగునీటి సంఘాల పరిధిలోని మండలాలకు చేరవేస్తున్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ సిబ్బంది, ఉన్నారు.

**ప్రజాశక్తి-ఎఎస్‌పేట** : తహశీల్దార్ కార్యాలయంలో సాగునీటి వినియోగదారుల సంఘం ఎన్నికల నోటిఫికేషన్‌ను తహశీల్దార్ డి.శ్రీరామకృష్ణ, నోడల్ అధికారి షేక్ యాసిన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ అనుమసముద్రంపేట మండలంలో 14 నీటి సంఘాలకు సంబంధించిన నోటిఫికేషన్ పత్రాలను, నోటీస్ బోర్డులో అంటించామని, 14వ తేదీ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎలక్షన్లు సమర్థవంతంగా నిర్వహిస్తామని తెలిపారు. ఎన్నికల నిర్వహించే ప్రాంతాల్లో, గ్రామ సచివాలయాల్లో, గ్రామ పంచాయతీల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో నోటిఫికేషన్ పత్రాలను పబ్లిష్ చేస్తున్నట్లు పత్రికా ముఖంగా వ్యాఖ్యానించారు.

**ప్రజాశక్తి-సంగం** : తహశీల్దార్ కార్యాలయంలో సాగునీటి వినియోగదారుల సంఘం ఎన్నికల నోటిఫికేషన్‌ను బుధవారం తహశీల్దార్ సోమ్లా నాయక్, నోడల్ అధికారి వినయ్ కుమార్ విడుదల చేశారు. ఆరు సాగునీటి సంఘాలకు సంబంధించిన నోటిఫికేషన్ పత్రాలను నోటీస్ బోర్డులో అంటించారు. ఆరు సాగునీటి సంఘాలకు సంబంధించి 44 ప్రాదేశిక నియోజకవర్గాలకు ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. 14వ తేదీ సాగునీటి సంఘం ఎన్నికలను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సమర్థవంతంగా నిర్వహిస్తామని తెలిపారు. ఎన్నికలు నిర్వహించే ప్రాంతాలలో, సచివాలయాల్లో, గ్రామ పంచాయతీల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో నోటిఫికేషన్ పత్రాలను పబ్లిష్ చేస్తామన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న జమ్మవరం రైతులు

## ఓటర్‌లిస్ట్‌లో పేరు లేదని రైతుల నిరసన

**ప్రజాశక్తి-ఎఎస్‌పేట** : స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నీటి సంఘాల ఓటర్ లిస్టులో పేర్లు నమోదు కాలేదని మండలంలోని జమ్మవరం గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ గ్రామంలోని నాయకులు నారె శ్రీహరి మాట్లాడుతూ గత నెలలో 12వ తేదీన తహశీల్దార్‌ను కలిసి నీటి సంఘాల ఓటర్ల జాబితాలో పేర్లు నమోదు చేయవని అర్జీలిచ్చినట్లు తెలిపారు. జమ్మవరం గ్రామ పొతఛరువు కింద ఆయకట్టు రైతులైన 14మంది పేర్లను ఎక్కించకుండా తాను చేసి తప్పించుకు తిరుగుతూ జాప్యం చేశారని ఆరోపించారు. ఇదే విషయాన్ని హైకోర్టుకు తాము వెళ్లగా వారు ఓట్లు ఎక్కించుకోమని ఆర్డర్ కాపీ ఇచ్చారని తెలిపారు. ఆ కాపీని తహశీల్దారుకు సమర్పించినా.. ఆయన కాపీని కూడా తీసుకోలేదని పత్రికా ముఖంగా ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని తహశీల్దారును ఫోన్‌లో సంప్రదించగా, విజయవాడలోని సి.ఎ.డి.ఎ. లేక ఆత్మకూరులోని కార్యాలయంలో సంప్రదించాలని తెలిజేశారన్నారు.

## రైతులకు అండగా నిలిచే వారినే ఎన్నుకోవాలి

- ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు లక్కు కృష్ణప్రసాద్

**ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్**

14న జరగనున్న సాగునీటి వినియోగదారుల సంఘం ఎన్నికల్లో రైతులకు అండగా నిలిచే వారినే ఎంపిక చేసుకోవాలని ఎపి రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు లక్కు కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇవాళ నీటి నిర్వహణ సంఘాలకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అయిందని, అన్ని ప్రాంతాలకూ ఎన్నికల సామాగ్రి కూడా అధికారులు పంపించినట్లు తెలిపారు. అయితే రెండు, మూడుసార్లు వాయిదాలు పడిన ఈ నోటిఫికేషన్ బుధవారం విడుదల చేశారని తెలిపారు. 14వ తేదీ ఎన్నికల జరపడం అనేది రైతులకు తెలియని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఎప్పటికైనా సరే పది సంవత్సరాల తర్వాత ఎన్నికలు జరిగే సమయంలో తగినంత ప్రచారం నిర్వహించి ఈ ఎన్నికలు నిర్వహిస్తే బాగుంటుందని అలాగే ఆత్మకూరు నియోజకవర్గంలో 59 నీటి సంఘాలకు ఎన్నికలు జరగబోతున్నాయని తెలిపారు. రైతులందరూ ఈ ఎన్నికలకు పాల్గొని ఇవి అసలైన రైతుల ఎన్నికలు భవిష్యత్తులో నీటి నిర్వహణ ఎలా ఉండాలనేది రైతుల మాత్రమే నిర్ధేశిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. అలా నిర్ధేశించాలంటే మంచి సంఘాలు నీటి నిర్వహణ గురించి అవగాహన ఉండే రైతు సంఘాల సభ్యులుగా ఎంపిక కాబట్టే బాగుంటుందన్నారు. రాజకీయాలకు అతీతంగా రైతులు రైతులకు అండగా నిలిచే వారిని ఎంపిక చేసుకోవాలని రాజకీయ నాయకులు కూడా ఆ విధంగా రాజకీయ నాయకులు కూడా రైతులను ప్రోత్సహించాలని నియోజకవర్గంలో ఆరు మండలాలు 57 నీటి సంఘాలకు ఎన్నికలు జరిగి మంచి సంఘాలను ఎంపిక చేసుకోవాలని తెలియజేశారు.

## తక్షణమే కార్మికుడికి మెరుగైన వైద్యమందించాలి

- ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షులు కత్తి శ్రీనివాసులు

**ప్రజాశక్తి-నెల్లూరు**

వహాబ్‌పేట హోటల్ డిఆర్ ఉత్తమ వీధిలో మ్యాన్‌హోల్‌లో బ్లాక్‌ను తొలగించే పనిలో ప్రమాదం జరగ్గా, తీవ్రంగా గాయపడ్డ అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ కార్మికుడు జెపెంచలయ్యకు తక్షణమే మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం, జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని, కార్పొరేషన్ పూర్తి బాధ్యతలు తీసుకోవాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షులు కత్తి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. బుధవారం మున్సిపల్ కార్పొరేషన్‌లో జె.పెంచలయ్య అను అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ కార్మికుడు పెంచలయ్య. ప్రమాద స్థలంలోనే ఎడమ చేతి రెండు వేళ్లు తెగి పక్కన పడిపోయాయి. ఈ సమాచారం తెలుసుకున్న ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాద స్థలంలో స్పృహ తప్పిన కార్మికుడిని వైద్య చికిత్సల నిమిత్తం తోటి కార్మికులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు.

టెంకాయ కొడుతున్న టిడిపి నేత డాక్టర్ వి.మల్లికార్జున్

## 'కాకర్ల' సేవలు భేష్..

**ప్రజాశక్తి వరికుంటపాడు**

మెట్టప్రాంతంలో మట్టి రోడ్లను రూపుమాపి సిమెంట్ రోడ్ల నిర్మాణ కృషికి నిధులు మంజూరు చేయించిన ఉదయగిరి ఎంఎల్‌ఎ కాకర్ల సురేష్ సేవలు అభినందనీయమని టిడిపి యువ నాయకులు డాక్టర్ వి.మల్లికార్జున్ పేర్కొన్నారు. మండలంలోని నల్లబోతులవారిపల్లెలో బుధవారం సిసిరోడ్లకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో 40యేళ్ల నుంచి మట్టి రోడ్లతోనే కనీస వసతులు కూడా లేక అల్లాడుతున్నామన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా గ్రామాల రోడ్ల దుస్థితి అధ్వానంగానే ఉండేదన్నారు. నేడు ఎంఎల్‌ఎ కాకర్ల సురేష్ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ప్రత్యేకంగా రూ.10లక్షలతో మూడు రోడ్లకు నిధులు మంజూరు చేయించిన ఘనత ఆయనదే అని కొనియాడారు. అంతేకాకుండా ఉదయగిరి నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో మట్టిరోడ్లు లేకుండా ప్రతి గ్రామంలో సిమెంట్ రోడ్లు నిర్మాణానికి పూనుకున్న ఎంఎల్‌ఎ కాకర్ల సురేష్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వేముల పెదమాలకొండయ్య, గ్రామపెద్దలు, యువకులు పాల్గొన్నారు.

కేక్ కట్‌చేస్తున్న జనసేన నాయకులు

## నాగబాబు ఎంపికపై హర్షం

**ప్రజాశక్తి-ఎఎస్‌పేట**

జనసేన సీనియర్ నాయకులు కొణిదల నాగబాబుకు రాష్ట్ర మంత్రి వర్గంలో స్థానం కల్పించడం శుభసూచికమని నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మండల పరిధిలోని జనసేన నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆ సమావేశంలో జన సైనికులతో కలిసి స్వీట్లు పంచుకొని ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం మండల అధ్యక్షుడు సయ్యద్ అక్బర్‌భాషా మాట్లాడుతూ సీనియర్‌నేత నాగబాబుకు మంత్రివర్గంలో చోటు కల్పించడం ఆనందదాయకమన్నారు. కార్యక్రమంలో జనసేన యూత్ లీడర్ భాను చంద్ర, సోషల్ మీడియా ఇన్‌ఛార్జ్ చంద్రారెడ్డి, కావలి ఎడవల్లి జనసేన నాయకులు ఉల్లగంటి శ్రీనివాసులు, పార్టీ నాయకులు హరికృష్ణ, నాయబ్, తదితరులు పాల్గొన్నారు.

## పలుచోట్ల రెవెన్యూ సదస్సులు

**ప్రజాశక్తి-ఉదయగిరి** : సున్నంవారి చింతల సచివాలయం పరిధిలోని గ్రామ సమస్యలపై రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ ఎం.సుభద్ర పాల్గొని ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సును పంచాయతీ ప్రజలు సద్వినియోగం చేసుకుంటున్నారన్నారు. ముఖ్యంగా గ్రామంలో సంబంధించిన భూములలో మార్పులు చేర్పులు అలాగే సరిహద్దులు సమస్యలు రీసర్వేలో పొరపాట్లు తదితర సమస్యలపై పంచాయతీ ప్రజల నుండి ఎక్కువగా భూమి కావాలని భూ సమస్యలపై అర్జీలను అందజేశారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొల్లుబోయిన కృష్ణ యాదవ్, ఆర్ఐ సురేంద్ర, కార్యదర్శి విఆర్ పాల్గొన్నారు.

**ప్రజాశక్తి-బిట్రగుంట** : మండలంలోని జువ్వలదిన్నె పంచాయతీ సచివాలయంలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహశీల్దార్ సురేష్‌బాబుతో కలసి జనసేన కావలి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ అళహరి సుధాకర్ పాల్గొన్నారు. రెవెన్యూ సదస్సులో వస్తున్న అర్జీలు వాటి పరిష్కారానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. సదస్సులో ఉన్న విఆర్‌ఒలతో అర్జీ ఇచ్చిన వారికి అందిస్తున్న రసీదు వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అళహరి సుధాకర్ మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన అర్జీలను 15 రోజుల్లో పరిశీలించిన పరిష్కారం చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ సురేష్ బాబు, రెవెన్యూ అధికారులు, కూటమి నాయకులు తిరుమలశెట్టి వెంకటేష్, సుధీర్, బాలు, మంగళగిరి శ్రీను, వినయ్, వేణుగోపాల్, కొడియంగారి శ్రీను, శివ, ప్రకాష్, యాదయ్య గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల కోసం పనిచేసే వ్యక్తి 'చంద్రబాబు'

**ప్రజాశక్తి-కావలి**

నిరంతరం ప్రజల కోసం పనిచేసే వ్యక్తి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని, ఆయన సహకారంతో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా రాష్ట్రం ముందుకు సాగుతుందని కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి తెలిపారు. బుధవారం కావలి టిడిపి కార్యాలయంలో జరిగిన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని 12మంది లబ్ధిదారులకు సంబంధించిన రూ.10,77,188 చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ గత 6 నెలలుగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరం జరుగుతూనే ఉన్నాయని తెలిపారు. గత ఐదేళ్ల వైసిపి పాలనలో ప్రయివేటు వ్యక్తుల ఆస్తులు అన్యాక్రాంతమయ్యా యని తెలిపారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తీసుకొని వచ్చి ప్రజల ఆస్తులను కాజేయాలని చూశారన్నారు. రీ సర్వే పేరుతో ప్రజలను అనేక ఇబ్బందులకు గురి చేశారన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడా నికి అధికారులే ప్రజల ముందుకు వచ్చేలా 6వ తేదీ నుండి వచ్చేనెల 8వ తేదీ వరకు ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నారని, గ్రామస్తులు తమ సమస్యలను అర్జీ రూపంలో ఇచ్చినట్లయితే 45 రోజులలో వాటికి పరిష్కారం లభిస్తుందని తెలిపారు. చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వంలో మన సమస్యలను మన ముంగిటే పరిష్కరిస్తామని తెలిపారు. కావలి నియోజక వర్గానికి చెందిన బీద మస్తాన్‌రావు టిడిపిలో చేరడం, రాజ్యసభ ఎంపిగా నామినేషన్ వేసినట్లు, ఆయన రాకను స్వాగతిస్తున్నామని, మంచి వ్యక్తి సేవ చేయడానికి వస్తున్నందుకు అభినందిస్తున్నానని తెలిపారు. రైతుల ఇబ్బందులు తొలగాలన్నా, సాగునీటి కష్టాలు తీరాలన్నా, 14వ తేదీ జరగబోయే సాగునీటి సంఘాల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిరంతరం వాటర్ మేనేజ్‌మెంట్‌పై సమీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు. కావలి నియోజకవర్గంలో ప్రతిఒక్క ఎకరాకు నీరు అందించడమే ధ్యేయంగా పని చేస్తున్నామని తెలిపారు. టిడిపి చేపడుతున్న సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని, పార్టీ కుటుంబ సభ్యులు ప్రతిఒక్కరూ తప్పనిసరిగా సభ్యత్వం చేసుకొనేలా చూడాలన్నారు. పార్టీలకతీ తంగా అర్హులైన ప్రతిఒక్కరూ ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. కావలి నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కష్టపడుతున్నానని, ప్రతి ఒక్కరూ అండగా నిలిచి కావలిని కనకపట్నం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కావలి పట్టణ టిడిపి అధ్యక్షులు గుత్తికొండ కిషోర్, ప్రధాన కార్యదర్శి జ్యోతిబాబు రావు, జిల్లా ఉపాధ్యక్షులు బీద గిరిధర్, గుంటుపల్లి రాజ్‌కుమార్ చౌదరి, కండ్లగుంట మధుబాబు నాయుడు, కావలి రూరల్ మండల ప్రధాన కార్యదర్శి ఉప్పాల వెంకట్రావు, చిలకపాటి వెంకటేశ్వర్లు, రమేష్ రెడ్డి, ఉప్పు వెంకట స్వామి, చిలకపాటి శ్రీనివాసులు, ఉప్పాల వెంకయ్య, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెక్కును అందజేస్తున్న ఎంఎల్‌ఎ క్రిష్ణారెడ్డి

**ప్రజాశక్తి-బిట్రగుంట** : కావలి టిడిపి కార్యాలయంలో బుధవారం ఎంఎల్‌ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బోగోలు మండలం చెంచులక్ష్మిపురం గ్రామానికి చెందిన మస్తాన్ కుటుంబానికి అందజేశారు. బోగోలు మాజీ ఎంపిటిసి చిలకపాటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులకు ఆ చెక్కును అందజేశారు.

# పెండింగ్ జీతాల కోసం నిరసన

**ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్**

నిరసన తెలియజేస్తున్న కార్మికులు

ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో తమకు రెండు నెలల జీతాలు, పెండింగ్ బకాయిలు ఉన్నాయని, పెండింగ్ జీతాలు చెల్లించాలంటూ సిఐటియు నేతలతో కలిసి మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు బుధవారం నిరసన ధర్నా నిర్వహించారు. తమ జీతంతో పాటు గతంలో తమకు రావాల్సిన బకాయిలను కూడా వెంటనే విడుదల చేయాలన్నారు. కార్మికులకు అందించాల్సిన సబ్బులు, నూనెలు, యూనిఫారంలను అందించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్మికులతో పాటు మద్దతుగా ఆత్మకూరు పట్టణ సిఐటియు అధ్యక్షులు ఆత్మకూరు నాగయ్య, సిపిఎం కార్యదర్శి డేవిడ్ రాజు ఈ నిరసనలో పాల్గొన్నారు. నినాదాలు చేసిన అనంతరం మున్సిపల్ కార్యాలయం సిబ్బందికి తమ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ పనిచేస్తేనే పూటగడవని పరిస్థితుల్లో ఉంటే నెలలు తరబడి జీతాలు నిలుపుదల చేస్తే వారి పరిస్థితి ఏమిటని వెంటనే వారికి రావాల్సిన జీతాలతో పాటు గతంలో రావాల్సిన బకాయిలను కూడా వెంటనే విడుదల చేయాలని మున్సిపల్ అధికారులకు తెలియజేశారు.

## ప్రతిరోజూ 50 గృహాలను సందర్శించాలి

**ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్** : ఇటీవల కాలంలో కురిసిన వర్షాలతో సీజనల్ వ్యాధులైన మలేరియా, చికున్ గున్యా, టైఫాయిడ్, తదితర వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని, ఎఎన్‌ఎంలు, ఆశాలు ప్రతి రోజు 50 గృహాలను సందర్శించి ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా మలేరియా అధికారిణి హుసేనమ్మ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని అర్బన్ పిహెచ్‌సిని తనిఖీ చేసి, అనంతరం సిబ్బందితో మాట్లాడారు. నిల్వ నీటిలో దోమలు పెరిగే అవకాశముందని ప్రజలకు వాటిపై అవగాహన కల్పించాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించాలన్నారు. ప్రజలకు అవగాహన సదస్సుల ద్వారా ఈ విషయాలను తెలియజేయాలని, జ్వరాల కేసులు ఉంటే వెంటనే ఫీవర్ సర్వే చేసి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లో డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, డయేరియా కేసులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షేక్ అస్మా, ఎంపిహెచ్ఇఒ ఎస్.సుధాకర్, ఎంపిహెచ్ఎస్ యు పార్వతి, ఎఎన్‌ఎంలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి హుస్సేనమ్మ

## 'పొలం పిలుస్తోంది'

**ప్రజాశక్తి-ఉదయగిరి** : మండలంలోని జి.చెరువు పల్లి, బండగానిపల్లిలో ఉన్న రైతు సేవా కేంద్రాలను మండల వ్యవసాయ అధికారి ఆంజనేయులు నాయక్ సందర్శించి రైతు సేవా కేంద్రం అధికారుల తో మాట్లాడి రబీ 2024-25లో ఈ-క్రాప్ నమోదు చేయాలని తెలియజేశారు. అందులో భాగంగా మండల వ్యవసాయ అధికారి గ్రామస్థాయి రైతు సేవా కేంద్ర సిబ్బంది, రైతులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాలపై నివారణపై అవగాహన

**ప్రజాశక్తి-మర్రిపాడు** : మండలంలోని నందవరం ఎపి మోడల్ స్కూల్లో రోడ్డు ప్రమాదాల నివారణపై విద్యార్థులకు ఆత్మకూరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాములు అవగాహన కల్పించారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం మైనర్లు వాహనాలు తీసుకోవడం నేరమన్నారు. మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వటం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. త్రిబుల్ రైడింగ్ చట్టరీత్యా నేరం అని త్రిబుల్ రైడింగ్ చేసే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. లైసెన్సు లేనివారిని డ్రైవర్లుగా స్కూలు వ్యాన్లకు నియమించవద్దని తెలిపారు. మైనర్లు ద్విచక్ర వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## రోడ్డు వేయరూ..

**ప్రజాశక్తి-ఎఎస్‌పేట**

మండల పరిధిలోని జెడ్.పి.హెచ్.ఎస్. హైస్కూల్, బిసి హాస్టల్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లే దారి అధ్వానంగా తయారైందని స్థానిక డాక్టర్ వి.సురేష్ బాబు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం తమ ఆరోగ్య కేంద్రానికి, దర్గా దగ్గరకు వచ్చిన భక్తులు వివిధ రకాల సమస్యలతో, ఆరోగ్య సమస్యలున్న వారు ఎక్కువగా వస్తుంటారని, అదేవిధంగా స్కూల్ విద్యార్థులు స్కూల్‌కు వెళ్లడానికి ఇబ్బందికరంగా ఉందన్నారు. 108లో పేషంట్లను తీసుకురావడం అంటే నాన హైరానా పడాల్సి వస్తుందని కావున ఈ విషయాన్ని స్థానిక నాయకులు, ఉన్నత అధికారులు గమనించి ఈ దారిని బాగు చేయాలని పత్రికా ముఖంగా తెలియజేశారు.

## సుబ్రహ్మణ్యేశ్వరస్వామి జయంతి

**ప్రజాశక్తి-ఉదయగిరి**

మేకపాటి గౌతమ్ రెడ్డి వ్యవసాయ కళాశాలలో సుబ్రహ్మ ణ్యేశ్వర స్వామి 142వ జయంతి సందర్భంగా బుధవారం అసోసియేట్ డీన్ డాక్టర్ జి.కృష్ణారెడ్డి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థిని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ తమిళ రచయిత, కవి, పత్రికా సంపాదకుడు, స్వాతంత్ర్య సమర యోధుడు, సంఘ సంస్కర్త అని, ఆధునిక తమిళ కవిత్వానికి మార్గదర్శిగానూ, "మహాకవి భారతి"గానూ సుప్రసిద్ధుడు, తమిళ సాహిత్య ప్రముఖుల్లో అత్యున్నత వ్యక్తిగా పేరొందారని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ గోపికృష్ణ, డాక్టర్ రఘునాథ రెడ్డి, డాక్టర్ సునీత, డాక్టర్ దుర్గాప్రసాద్, డాక్టర్ రమేష్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కమల ప్రియ, బోధ నేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

**డాక్యుమెంట్లు పోయినవి**

**మేకల వంశీకృష్ణ**, తండ్రి **సుధాకర్**, కుడితిపాళెం గ్రామం, ఇందుకూరు పేట మండలం, నెల్లూరు జిల్లా నేను **తేదీ: 02-12-2024** న నా ఒరిజినల్ రిజిష్టరు **డాక్యుమెంట్లు నెంబర్లు 7643/2003** మరియు **2040/2024** కుడితిపాళెం గ్రామం నుండి ఇందుకూరు పేట సెంటర్‌కు జెరాక్స్ కొరకు మోటారు బైక్‌లో తీసుకొని పోవుచుండగా మార్గ మధ్యలో జారిపడిపోయినవి. ఈ ఒరిజినల్ రిజిష్టరు డాక్యుమెంట్లు ఎవ్వరికైనా దొరికినయెడల ఈ క్రింది అడ్రస్సుకు తెలిపితగిన పారితోషికం పొందగలరు.

**మేకల వంశీకృష్ణ**
తండ్రి **సుధాకర్**
కుడితిపాళెం గ్రామం, ఇందుకూరుపేట మండలం
నెల్లూరు జిల్లా, సెల్: **99591 47800**

## న్యాయం చేయండి..

**ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాళెం**

గత 30 సంవత్సరాలుగా సాగు చేసు కుంటున్న అనుభవం కలిగిన తన పొల ంలోకి వెళ్లనివ్వకుండా అడ్డుకుంటున్నారని తనను ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి న్యాయం చేయా లంటూ ఓ వృద్ధ మహిళ రైతు వేడుకోలు. బుచ్చిరెడ్డిపాలెం మండలం, మునుపుడి పంచాయతీ రెడ్డిపాలెంలో సా రెడ్డి చిన్నమ్మ (భర్త ) సారెడ్డి కొండారెడ్డి వృద్ధ మహిళ రైతు గ్రామంలో అటవీ ప్రాంతానికి చెందిన భూమిని బాగు చేసుకుని సాగు చేసుకుం టున్నారు. 2003లో రెవెన్యూ అధికారుల తప్పిదం వల్ల 29 సెంట్లు తన భూమి అదే గ్రామానికి చెందిన రాఘ వేంద్ర రెడ్డి పట్టాలో చేరింది. అయినా అప్పటినుంచి చిన్నమ్మ సాగుబడి చేసుకుంటుంది.గత ప్రభుత్వంలో రీ సర్వే చేయగా రెవెన్యూ రికార్డుల ప్రకారం ఎవరికి చెందని ప్రభుత్వ భూమిగా ఉంది. అప్పటి పట్టా ప్రకారం రాఘవేంద్ర రెడ్డి 29 సెంట్లు పొలం తనకే చెందాలంటూ అధికారులను కోరారు.యధా ప్రకారం చిన్నమ్మ తన అనుభవంలోని 86-7, 87-6 సర్వే నెంబర్లు గల పొలాన్ని సాగు బడి చేసుకునేందుకు సిద్ధపడగా రాఘవేంద్ర రెడ్డి అడ్డుకొని దౌర్జన్యానికి దిగుతున్నాడని తనకు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి న్యాయం చేయాలంటూ ఆ వృద్ధ మహిళా రైతు వేడుకుంటుంది.

**"గ్రామ సర్పంచ్ పత్తి" వెంకటరమణారెడ్డి వివరణ**

సారెడ్డి చిన్నమ్మ గత 30 సంవత్సరాలుగా అటవీ ప్రాంతానికి చెందిన ఆ భూమిని బాగు చేసుకుని సాగుపడు చేసుకుంటుంది. అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆ భూమి తనకు చెందిందని ఆమె వద్ద నుంచి తనకు అప్పగించమంటూ అధికారులను ఒత్తిడి చేస్తున్నాడు. రెవెన్యూ అధికారులు స్పందించి 86-7,87-6 లో విచారణ జరిపించి న్యాయం చేయాలని కోరారు.

## డిగ్రీ పరీక్షల్లో ముగ్గురు డిబార్

**ప్రజాశక్తి-వెంకటాచలం**

విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ కళాశాలలో డిసెంబర్ 10 నుంచి డిగ్రీ పరీక్షలు మొదల య్యాయి.బుధవారం మధ్యా హ్నం జరిగిన ఒకటోవ సెమిస్టరు పరీక్షలో మొత్తం 8602 మంది విద్యార్థులకు గాను 7701 మంది హాజరయ్యారు. 901 మంది గైర్హాజయ్యారు.పరీక్ష కేంద్రం సర్వోదయ డిగ్రీ కళాశాల నెల్లూరులో ఒక విద్యార్థి, శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల నెల్లూరులో, వైష్ణవి డిగ్రీ కళాశాల వెంకటగిరిలలో ఒక్కో విద్యార్థి డిబార్ అయ్యారు.ప్రతి పరీక్షా కేంద్రంలో ప్రభుత్వం వారు నిర్దేశించిన ప్రకారం కోవిడ్ 19 నిబంధనలను పాటిస్తూ విద్యార్థులను పరీక్షా కేంద్రంలోనికి అనుమతించారు. ప్రతి పరీక్షా కేంద్రంలో మాస్కులను తప్పనిసరి చేస్తూ భౌతిక దూరం పాటిస్తూ పరీక్షలు నిర్వహించడం జరిగిందని పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ ఆర్.మధుమతి తెలిపారు.

## బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

**ప్రజాశక్తి-వెంకటాచలం**

మండలంలోని కంటేపల్లి గ్రామంలో 15 ఏళ్ల మైనర్ బాలిక పనిమీద బయటకు వెళ్లి అదశ్యమైనట్లు బుధవారం ఫిర్యాదు చేశారు. గత మూడు రోజుల కిందట పని మీద బయటకు వెళ్లిన మైనర్ బాలిక తిరిగి ఇంటికి రాకపోవడంతో బాలిక కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గాలించారు. ఎంతటికి బాలిక ఆచూకీ తెలియక పోవడ ంతో బాలిక తల్లి రత్నమ్మ వెంకటాచలం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# వాతావరణ సంక్షోభంపై అప్రమత్తం..

**..వాతావరణ పరిశోధన విశ్లేషకులు**
**..ఆచార్య ఎస్ విజయ భాస్కర్ రావు**

**ప్రజాశక్తి-వెంకటాచలం:**వాతావరణ సంక్షోభం పై అప్రమత్తంగా ఉండాలని విక్రమ సింహపురి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఎస్. విజయ్ భాస్కర్ రావు అన్నారు. వాతావరణ మార్పుల కారణంగా వేడి తరంగాలు, సుదీర్ఘమైన అదనపు వేడి పరిస్థితులు ఫ్రీక్వెన్సీ, వ్యవధి, తీవ్రత పరిమాణంలో పెరుగుతున్నాయి. తక్కువ, మితమైన తీవ్రత వేడి తరంగాలు కూడా జనాభా ఆరోగ్యం, శ్రేయస్సుపై ప్రభావం చూపుతా యని తెలిపారు. వాతావరణ మార్పుల కారణంగా 21వ శతాబ్దంలో విపరీతమైన వేడి, ఉష్ణ తరంగాల ఫ్రీక్వెన్సీ, తీవ్రత పెరుగుతూనే ఉంటుందని అధిక పగలు, రాత్రి ఉష్ణోగ్రత పరిస్థితులను పొడిగించిన కాలాలు మానవ శరీరంపై సంచిత ఒత్తిడిని సష్టిస్తాయి కాబట్టి వేడి బహిర్గతం నుండి అనారోగ్యం మరియు మరణాల ప్రమాదాన్ని పెంచుతాయన్నారు. విద్యుత్ కొరత ఏర్పడినప్పుడు అవి ఆరోగ్య సేవలను అందించే సామర్థ్యాన్ని కూడా కోల్పోతాయని వేడిగాలులు, ఆరోగ్య సౌకర్యాలు, రవాణా నీటి మౌలిక సదుపాయా లకు అంతరాయం కలిగిస్తూ ఉంటుం దన్నారు. జనాభా వృద్ధాప్యం, నాన్-కమ్యూనికేబుల్ వ్యాధుల (శ్వాసకోశ, హృదయ సంబంధ వ్యాధులు, మధుమేహం, చిత్తవైకల్యం, మూత్రపిండ వ్యాధి, కండరాల వ్యాధులు) పెరుగుతున్న ప్రాబల్యం అంటే జనాభా ప్రతికూల వేడి ప్రభావాలకు ఎక్కువ అవకాశం ఉంటుందన్నారు. గ్రీన్‌స్పేస్‌ను కోల్పోవడం, అధిక వేడికి మానవుని బహిర్గతం చేసే అనుచితమైన గృహోపకరణాలు (ఉదాహరణకు, లోహపు పైకప్పులు) వంటి వాటితో పట్టణ వేడిని చేరడం, ఉత్పత్తి చేయడం తగ్గించడానికి నగరాలు రూపొందించబడలేదన్నారు.

# ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించాలి

**ప్రజాశక్తి-కోవూరు** :కోవూరు సర్కిల్ పరిధిలోని ప్రాంతాల్లో ప్రజలు రానున్న క్రిస్మస్ కొత్త సంవత్సరం సంక్రాంతి సెలవుల సందర్భంగా వేరే ప్రాంతాలకు వెళ్లేవారు విహారయాత్రలకు వెళ్లేవారు తప్పనిసరిగా సంబంధిత పోలీస్ స్టేషన్. కు తగు సమాచారం ఇవ్వాలని కోవూరు సిఐ సుధాకర్ రెడ్డి తెలిపారు. కోవూరులోని సర్కిల్ కార్యాలయంలో లాకెడ్ హౌస్ మానిటరింగ్ సిస్టం కు సంబంధించిన కరపత్రాలను కోవూరు ఎస్ఐ రంగనాథ్ గౌడ్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విహారయాత్రలకు, పండుగలకు, ఇతర ప్రాంతాలకు ఇంటికి తాళాలు వేసే వెళ్లే వారి ఇళ్లను గుర్తించిన నేరస్తులు రిక్కీ నిర్వహించి ఆ ఇంటిలో దొంగతనం చేసేందుకు ప్రయత్నాలు చేస్తారన్నారు . దీనిని దృష్టిలో పెట్టుకుని ఇంటికి తాళాలు వేసి సుదూర ప్రాంతాలకు వెళ్లేవారు. లాక్డ్ హౌస్ మానిట రింగ్ సిస్టం యాం ్లో తమ పేరు నమోదు చేసుకోవా లన్నారు ఈ సేవలంతా పూర్తిగా ఉచితంగా అ ం ద ్ జ ే య ్ ఃడ ్ ం జరుగుతుందన్నారు. కోవూరు ప్రజలందరూ తప్పకుండా తమ మొబైల్ లోని ప్లేస్టోర్ నుంచి ఎల్ హెచ్ ఎం ఎస్ అనే ఆప్ ను డౌన్లోడ్ చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. పండుగలకు సెలవులకు దైవ దర్శనాలకు ఇతర కార్యక్రమాలకు ఇంటికి తాళం వేసి వెళ్ళేటప్పుడు ఎల్ హెచ్ ఎం ఎస్ యాప్ ను ఉపయోగించుకోవాలన్నారు. అందులో మీరు ఇంటి నుంచి వెళ్లే తేదీ మరి తిరిగి వచ్చే తేదీలా వివరాలు తెలియజయాలన్నారు. అటువంటి ఇళ్లకు పోలీస్ వారిచే.ఉచితంగా సీసీ కెమెరాలు ద్వారా నిఘా ఏర్పాటు చేసి మీ ఇళ్లలో దొంగతనాలు జరగకుండా మీరు తిరిగి వచ్చేవరకు ఆ ఇంటికి పటిష్టమైన భద్రత ఉంటుందన్నారు. దీంతోపాటు రాత్రి పగటివేళ్లలో ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక మైన గస్తీకూడా ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పోలీసు అధికారులు

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

**ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు**

పశువులకు సీజనల్ వ్యాధులు రాకుండా రైతులు అప్ర మత్తంగా ఉండాలని పశుసంవర్ధక శాఖ సహాయ సంచా లకులు డాక్టర్ బి. మురళి కృష్ణ సూచించారు. బుధవారం మండలంలోని చిన్నచెరుకూరు గ్రామంలో పశుసంవర్ధక శాఖ సహకారంతో, స్వర్ణభారతి-మండన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం జరిగింది. ఈ పశు వైద్య శిబిరంలో డాక్టర్ మురళి కృ ష్ణ, ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు సీజనల్ వ్యాధులు ప్ర బలకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పశువులకు సకాలంలో టీ కాలు, మందులను ఇప్పించాలని సూచించారు. కృత్రిమ గర్భ నిర్ధారణ చేసిన తర్వా త 4 నెలలకు తప్పనిసరిగా చూడి నిర్ధారణ పరీక్షలు చేయిం చాలని తెలిపారు. పశు గ్రాసం పెంపకంతో పోషణ ఖర్చు తగ్గించుకోవచ్చని చెప్పారు. ఉచిత ప శు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైద్య శిబిరంలో గర్భకోశ వ్యాధులకు గురైన గేదెలకు చికిత్సలు అందజేశారు. సా ధారణ వ్యాధులకు వైద్య చికిత్సలు చేశారు. దూడలకు నట్టల నివారణ మందులు తాగించారు. కార్యక్ర ్మంలో డాక్టర్లు ఓ. శ్రీనివాసులు, వి. శ్రీనివాసులు నాయుడు, ప్రవీణ్, నగేష్, నాగేంద్ర, మం డవ ఫౌండేషన్ ప్రతినిధులు, పశువైద్యులు పాల్గొన్నారు.

# బీమా చెక్కు అందజేత

**ప్రజాశక్తి-కోవూరు:** మండలంలోని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ పడుగుపాడు శాఖ బ్రాంచ్ మేనేజర్ ఎంవి చరణ్ కుమార్. బుధవారం బ్యాంక్ కార్యాలయ ప్రాంగణంలో ఖాతాదారునికి ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకం సంబంధించిన రెండు లక్షల రూపాయలు చెక్కును నామినీకి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ బ్యాంకులో ఖాతా దారు అయినా ఇనమడుగు గ్రామానికి చెందిన కె.గీత ఇటీవల మతి చెందింది. ఈ నేపథ్యంలో కే.గీత ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకంలో వార్షిక ప్రీమియం 436. రూపాయలు చెల్లించి ఉంది. దీంతో కే గీత భర్త అయినా గురవయ్యకు నామిని కింద ఈ పథకం కింద మంజూరైన రెండు లక్షల చెక్కును బుధవారం అందజేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకులో ఖాతా ఉన్నవారు ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకం కింద కేవలం సంవత్సరానికి చెల్లిస్తే 2 లక్షల రూపాయలు అందజేస్తామని తెలిపారు.

# అధికారులకు శిక్షణ సదస్సులు

**ప్రజాశక్తి-కోవూరు:** మండలంలోని అన్ని శాఖల మండల స్థాయి అధికారులకు, సర్పంచ్‌లకు, కార్యదర్శులకు, ు సిబ్బందికి ఈనెల 12 ,13 తేదీలలో స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు కోవూరు ఎంపీడీఓ సిహెచ్ శ్రీహరి రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాటా ్డుతూ మండలాల్లో సుస్థిరమైన అభివృద్ధి సాధించే శిక్షణ.సదస్సులను నిర్వహించడం జరుగుతుం దన్నారు. రెండు రోజులపాటు నిర్వహించే సదస్సులను. ప్రతి ఒక్కరూ పూర్తిస్థాయిలో. సద్వినియోగం.చేసుకోవాలని పేర్కొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

## నీటి సంఘాల ఎన్నికల్లో కూటమిలో జనసేనకు స్థానం

**ప్రజాశక్తి-వెంకటాచలం**

సర్వేపల్లి నియోజకవర్గం జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు కూటమి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డికి నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి జనసేన నుంచి పోటీ చేసే అభ్యర్థుల వివరాలు అందజేశారు. సర్వేపల్లి నియోజకవర్గంలో ఈనెల 14న జరగబోయే నీటి సంఘాల ఎన్నికలలో కూటమిలోని జనసేన పార్టీ ఐదు మండలాల మండల అధ్యక్షులతో కలిసి సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి కార్యాలయంలో కలిసి పేర్లు వివరాలను నమోదు చేసి అందజేశారు.కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు గుమ్మినేని వాణి భవాని నాయుడు, బోను బోయిన ప్రసాద్, అంకేం సందీప్, మనుబోలు గణపతి, మంద వెంకటేష్, పెనుబాక ప్రసాద్, దాసినేటి అనిల్, నారదాసు రవి సందూరి, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాశక్తి-దుత్తలూరు**

మండలంలోని వెంకటం పేట గ్రామంలో తహశీల్దార్ నాగరాజు బుధవారం రెవెన్యూ నదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ గ్రామ సభలను నద్వినియోగం చేసుకో వాలని కోరారు. రైతుల భూసమస్యల పరిష్కారానికి ఈ గ్రామ సభలు ఉపయోగపడతాయని తెలిపారు. అనంతరం రైతులు వివిధ భూ సమస్యలపై తహశీల్దారుకు అర్జీలిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ పెరుమల సుజాత, వెంకటేశ్వర్లు, జిల్లా యువజన ప్రధాన కార్యదర్శి బంకా రవి, మండల అధికారులు, సచివాలయం సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## తాగునీటి సమస్యను పరిష్కరిస్తా

**ప్రజాశక్తి-వింజమూరు**

వింజమూరు పంచాయతీ పరిధిలోని సాతాను వారి పాలెం, నార్త్ ఎస్సీ కాలనీ, జిబికెఆర్ ఎస్టీ కాలనీలలో వచ్చే వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యల్లో భాగంగా బోర్లు వేసి నేటి ఎద్దడిని లేకుండా పరిష్కరిస్తున్నామని పంచాయతీ సర్పంచి ఎన్ సుజనా తెలియజేశారు. ఈ మధ్యకాలంలో ఈ మూడు ప్రాంతాలలో తాగునీటి ఇబ్బందులకు గురవు తున్నారని ప్రజల తెలియజేస్తున్నారన్నారు. అందులో భాగంగానే ప్రజలు ఇబ్బందులు తీర్చడానికి ఆయా ప్రాంతాలలో తాగునీటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ అధికారులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## మాజీ ఎంసి చైర్మన్ రాధాకృష్ణారెడ్డి సతీమణికి ప్రసన్న పరామర్శ

**ప్రజాశక్తి-కోవూరు**

గుండె సంబంధిత వ్యాధితో కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స చేయించుకుంటున్న మాజీ ఎఎంసి చైర్మన్ రాధాకృష్ణారెడ్డి సతీమణి విజయమ్మను బుధవారం ఆస్పత్రిలో మాజీ ఎంఎల్ఎ ప్రసన్న కుమార్ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన కిమ్స్ హాస్పిటల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ శ్రీనివాస్ రాజు తో. మాట్లాడి విజయమ్మ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడి కోలుకుంటారని వారికి మనోధైర్యం కలిగించారు.